క్లుప్తంగా

తపాలా సేవలపై కళాజాత



రాంబిల్లిలో కళాజాత నిర్వహిస్తున్న తపాలా శాఖ అధికారులు

రాంబిల్లి(యలమంచిలి): తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ అధికారులు కోరారు. సోమవారం రాంబిల్లి మండలం కేంద్రంలో తపాలాశాఖ సేవలు, పోస్టల్ ఇన్సురెన్స్, తదితర సేవలపై కళాకారులతో కళాజాత ప్రదర్శనతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు, పోస్ట్‌మేన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పలకరించిన వరుణుడు



కోటవురట్లలో కురుస్తున్న వర్షం

కోటవురట్ల: వరుణుడు పలకరించి పోయాడు. మండలంలోని పలు ప్రాంతాలలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచిపోయింది. మెరక ప్రాంతాలలో పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. వరి చేలకు కూడా వర్షం జీవం పోస్తుందని అంటున్నారు.

ముగిసిన భవానీ దీక్షలు



ఇరుముడులు కడుతున్న గురుభవానీ

నక్కపల్లి: మండలంలో వివిధ గ్రామాల్లో భక్తులు చేపట్టిన భవానీ దీక్షలు ముగిశాయి. మండల, అర్ధ మండల, నవరాత్రి దీక్షలు చేపట్టిన భవానీ భక్తుల్లో చాలా మంది సోమవారం ఇరుముడులు కట్టుకుని మొక్కు చెల్లించుకునేందుకు విజయవాడ బయలు దేరారు. కొద్ది మంది విజయదశమినాడు అమ్మవారి మొక్కు చెల్లించుకునేందుకు వెళ్లగా.. మరికొంత మంది రద్దీని దృష్టిలో ఉంచుకుని సోమవారం బయలు దేరారు. మూడురోజులుగా దీక్షలు చేపట్టిన వారందరికి ఉపమాక డీఆర్‌బీ పీఠానికి చెందిన గురభవానీ రాంబాబు ఇరుముడులు కట్టారు. నవంబరు నెల రెండో వారం నుంచి అమ్మవారి చండీ దీక్షలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

మునగపాక: ప్రజలకు సకాలంలో సేవలందించాలని తహసీల్దార్ ఆది మహేశ్వరరావు కోరారు. మునగపాక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, సర్వేయర్లతో ఆయన సమావేశమయ్యారు. ఇంత వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. పట్టాదారు పుస్తకాలు, పలు రకాల ధ్రువీకరణ పత్రాలపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేలా చూడాలన్నారు. రీ-సర్వేకు సంబంధించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీటీ శేషబాబు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మునగపాక పీఏసీఎస్ సీఈవోపై ఫిర్యాదు

మునగపాక: మునగపాక పీఏసీఎస్ సీఈవో ఆడారి కృష్ణ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంపై అదే గ్రామానికి చెందిన రైతు పీలా అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల కోసం పీఏసీఎస్‌కు వస్తే తనను దుర్భాషలాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సాయంత్రం 5 గంటల వరకు రైతులకు సేవలందించాల్సి ఉన్నా సీఈవో కృష్ణ వ్యవహరించిన తీరు సరిగా లేదన్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశానని అప్పారావు తెలిపారు. ఈ విషయమై సీఈవో కృష్ణను వివరణ కోరగా.. తనపై తప్పుడు ఆరోపణలు చేయడం రైతు అప్పారావుకు సరికాదన్నారు. అప్పటికే సొసైటీలో 20 మందికి పైగా రైతులు ఎరువుల కోసం వేచి ఉన్నారని, వారికి అందించిన తరువాత చూద్దామని చెప్పానన్నారు.

మొక్కుబడి సర్వే!

- ఓటరు జాబితాల తనిఖీపై నిర్లక్ష్యం
- బీఎల్వోలు 100 శాతం ఇంటింటి సర్వే చేశారట
- కార్యాలయాల్లో కూర్చుని పాత డేటాను ధ్రువీకరించి సర్వే పూర్తి
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

సర్వే చివరి తేదీ: **అక్టోబరు 18**
ముసాయిదా జాబితా విడుదల: **అక్టోబరు 29**
అభ్యంతరాల స్వీకరణ: **డిసెంబర్ 24 వరకు**
తుది ఓటర్ల జాబితా ప్రకటన: **2025 జనవరి 6**

నియోజకవర్గంలో ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, సర్వే వివరాలు

మండలం	ఓటర్లు	పోలింగ్ బూత్‌లు	బీఎల్వోల సర్వే శాతం
యలమంచిలి	56,694	67	100.01
రాంబిల్లి	42,105	51	100.10
అచ్యుతాపురం	45,118	56	100.01
మునగపాక	62495	72	100.04
మొత్తం	2,06,412	246	100.04



ఓటరు జాబితా సవరణపై పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఈఆర్వో మనోరమ(ఫైల్)

యలమంచిలి రూరల్: ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా అత్యంత కీలకమైన ఇంటింటి సర్వే యలమంచిలి నియోజకవర్గంలో మొక్కుబడిగా జరుగుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో బీఎల్‌వోలంతా కార్యాలయాల్లో కూర్చుని సర్వేను 100 శాతానికి పైగా పూర్తి చేసినట్టు నివేదికలు, రికార్డులు సిద్ధం చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యలమంచిలి నియోజకవర్గంలో యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో ఇంటింటి సర్వేకు బీఎల్వోలు ఎప్పుడొచ్చారో? ఎక్కడ చేశారో తెలీదంటూ ఓటర్లంతా ముక్కున వేలేసుకుంటున్నారు. నాలుగు నెలల క్రితమే సాధారణ ఎన్నికలు పూర్తికావడంతో రాజకీయ పార్టీల నాయకులు కూడా ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సవరణపై పెద్దగా దృష్టి సారించలేదు. దీంతో అత్యంత కీలకమైన ఈ ప్రక్రియ సజావుగా జరగడం లేదన్న విమర్శలు ఓటర్ల నుంచి వస్తున్నాయి.

ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా కీలకం. ఈ క్రమంలో తప్పులను సరిదిద్ది ఎన్నికల సమయానికి పారదర్శకమైన ఓటరు జాబితా తయారు చేయడానికి ఎన్నికల సంఘం ప్రతి ఏటా సవరణ ప్రక్రియను చేపడుతోంది. ఈ ఏడాది స్పెషల్ సమ్మరీ రివిజన్ -2025 చేపట్టడానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం 2024 ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకూ బీఎల్‌వో(బూత్ లెవెల్ ఆఫీసర్)లు ఇంటింటి సర్వే చేపట్టాల్సి ఉంది. కొత్త ఓటర్ల వివరాల సేకరణతో పాటు, ప్రస్తుతం జాబితాలో ఉన్న ఓటర్లకు సంబంధించి తప్పులు సరిచేయడం, మృతులు, శాశ్వత వలస ఓటర్లు, చిరునామా, ఫొటోల మార్పులు వంటివి చేయడానికి తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయాల్సి ఉంది. అవసరమైన చోట ఓటర్ల నుంచి కావాల్సిన మార్పులకు దరఖాస్తులు తీసుకోవాలి. కానీ ఇవన్నీ ఎక్కడా సక్రమంగా జరగలేదు. ఎవరైనా ఇంటింటి సర్వే గురించి అడిగితే ఈ సారి అలాంటి సర్వే చేయనక్కర్లేదని కొందరు బీఎల్‌వోలు బహిరంగంగా చెబుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని చోట్ల అధికార కూటమి పార్టీల నాయకులను అడిగి సర్వే పూర్తి చేశారన్న ఆరోపణలున్నాయి. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని మండల స్థాయిలో పర్యవేక్షించాల్సిన తహసీల్దార్లు, నియోజకవర్గ స్థాయిలో ఎలక్టోరల్ నమోదు అధికారులైన ఆర్డీవో స్థాయి అధికారులు, జిల్లా స్థాయిలో డీఆర్వో, జేసీ, కలెక్టర్ పర్యవేక్షించాల్సి ఉంది. కానీ అన్ని స్థాయిల్లోనూ పర్యవేక్షణ కొరవడడంతో బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టకుండానే చేసినట్టు రికార్డుల్లో చూపుకున్నారు. ఈ నెల 18 వరకూ ఇంటింటి సర్వేకు గడువు ఉన్నప్పటికీ ఈ నెల 5వ తేదీనే జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి జిల్లాలో సర్వే 99.89 శాతం పూర్తయినట్టు మీడియాకు తెలియజేశారు. దీనిని బట్టి సర్వే ఎంత మొక్కుబడిగా జరిగిందో అవగతమవుతోంది.

మా ఇంటికి బీఎల్‌వో రాలేదు



మా ఇంటికి బీఎల్‌వో ఎవరూ రాలేదు. మా కుటుంబ సభ్యుల ఓట్లు మూడు పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఉన్నాయి. మా కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే కేంద్రంలో ఉండేలా దరఖాస్తు చేద్దామంటే బీఎల్‌వో రాలేదు. దీంతో సవరణకు ఇబ్బంది వస్తోంది. ఇంటింటికీ రాకుండానే సర్వే పూర్తయినట్టు రికార్డుల్లో చూపించుకోవడం దురదృష్టకరం. అధికారులు స్పందించి సర్వే పక్కాగా జరిగేలా చూడాలి.

– పి.రంగసాయి, విశ్రాంత ఉపాధ్యాయుడు, గాంధీనగరం, యలమంచిలి

ఇలా అయితే సర్వే ఎందుకు?



ఇంటింటి సర్వే సక్రమంగా జరగలేదు. దీనిపై ఉన్నతాధికారులు ర్యాండమ్‌గా తనిఖీలు చేపడితే అసలు విషయం బయటపడుతుంది. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమంపై ఓటర్లకు అవగాహన కూడా కల్పించలేదు. మొక్కుబడి సర్వే కారణంగా ఒక చోటు నుంచి ఇంకో ప్రాంతానికి మారిన ఓటర్లకు చిరునామా మార్చుకునే అవకాశం లేకుండా పోయింది. ఇలా అయితే ఎన్నికల సంఘం సర్వేకు షెడ్యూల్ ఇవ్వడంలో అర్థం లేదు.

– దూది నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎర్రవరం

మా చిరునామా మారింది..



గతంలో మిలట్రీ కాలనీలో నివాసముండే మా కుటుంబం టిడ్కో గృహ సముదాయంలోకి మారాం. ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో చిరునామా మార్చుకుందామనుకున్నాం. కానీ సర్వే పూర్తయిపోయిందని పత్రికల్లో చూసి ఆశ్చర్యపోయాం. బీఎల్‌వోలు మా చిరునామా సవరణ చేయాలి.

– కె.సన్యాసిరాజు, టిడ్కో గృహ సముదాయం, యలమంచిలి

సర్వే జరిగినట్టే తెలియదు..



ఓటరు జాబితాల్లో సవరణ కోసం సర్వేకు మా ఇంటికి ఎవరూ రాలేదు. మేము గతంలో ఓరుగంటి వారి వీధిలో నివాసం ఉండేవాళ్లం. ఇప్పుడు టిడ్కో గృహ సముదాయంలో ఉంటున్నాం. చిరునామా మార్చుకోవాలంటే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లడానికి కుదరడంలేదు. బీఎల్వోలు మా ఇంటికొచ్చి వివరాలు తీసుకుని చిరునామా మార్చాలి.

– బి.మానస, టిడ్కో గృహ సముదాయం, యలమంచిలి

తహసీల్దార్ల పర్యవేక్షణలో సర్వే



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ 2025లో భాగంగా బీఎల్‌వోల ఇంటింటి సర్వే ఆయా మండలాల తహసీల్దార్ల పర్యవేక్షణలో జరిగింది. ఆగస్టు 20న ప్రారంభమైన ఇంటింటి సర్వే పారదర్శకంగా చేయాలని బీఎల్‌వోలకు సూచించాం. ఎక్కడా ఫిర్యాదులు రాలేదని బీఎల్‌వోలు చెప్పారు. సర్వేలో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే సరిచేస్తాం. బీఎల్‌వోలు కార్యాలయాల్లోనే కూర్చుని సర్వే చేశారనే విషయం మా దృష్టికి రాలేదు. గత నెల 30న యలమంచిలిలో రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాం.

– కె మనోరమ, నియోజకవర్గ ఎలక్టోరల్ నమోదు అధికారి

స్ఫూర్తినింపిన ‘ప్రేరణ ఉత్సవ్’



ప్రేరణ ఉత్సవ్‌కు జిల్లా నుంచి హాజరైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

యలమంచిలి రూరల్: ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమం తమలో ఎంతో స్ఫూర్తిని, నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా చేసిందని జిల్లా నుంచి కార్యక్రమానికి హాజరైన యలమంచిలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని దిగుమర్తి వైష్ణవి, నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.హర్షవర్ధన్ అభిప్రాయపడ్డారు. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు గుజరాత్‌ వాడ్నాగర్ ప్రేరణ స్కూల్‌లో వారం రోజుల పాటు జరిగిన ప్రేరణ ఉత్సవ్ 2024కు జిల్లా తరఫున హాజరైన ఇద్దరు విద్యార్థులు, వారితో వెళ్లిన ఎస్కార్ట్ టీచర్ ఎ.సునీతలను సోమవారం యలమంచిలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రేరణ ఉత్సవ్‌లో తమ అనుభవాలను అందరితో పంచుకున్నారు. విద్యార్థి దశలో ఇలాంటి కార్యక్రమాలకు హాజరయ్యే అవకాశం రావడం తమ అదృష్టమని చెప్పారు. వారికి ఎస్కార్ట్‌గా వెళ్లిన ఉపాధ్యాయురాలు సునీత కూడా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ప్రేరణ ఉత్సవ్‌లో పాల్గొనే అవకాశం దక్కించుకున్న విద్యార్థులకు ఇదొక వరమన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



చూచుకొండ పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యురాలు జైత్ర

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం పీహెచ్‌సీని సోమవారం ఢిల్లీకి చెందిన కేంద్ర బృంద సభ్యురాలు జైత్ర సందర్శించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై పర్యవేక్షించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మందుల గదులను పరిశీలించడంతో పాటు బీపీ, మధుమేహ రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ సుగుణకు సూచించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ ఎస్తేర్‌రాణి, ఆరోగ్య పర్యవేక్షకుడు రమణబాబు, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, సూపర్‌వైజర్లు సునీత, ఉమామహేష్, సిబ్బంది శాంతి, శిరీష, ఇందిర, గణేష్, ముఖేష్, నాగేశ్వరరావు, గాయత్రి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చూచుకొండ పీహెచ్‌సీ సందర్శన

మునగపాక: మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీని సోమవారం ఢిల్లీకి చెందిన కేంద్ర బృంద సభ్యురాలు జైత్ర సందర్శించారు. ఆరోగ్యకేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసున్న కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సీజన్‌లో రోగాలు సంభవించకుండా తీసుకుంటున్న చర్యలపై డాక్టర్ ఎస్తేర్‌రాణిని అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రశాంతి, సీసీ రమణబాబు, హెచ్ఎస్ లక్ష్మణ్, హెచ్‌వీ బేగం, ఆరోగ్య కార్యకర్త శరగడం అప్పలనాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

‘పల్లె పండగ’తో గ్రామాల అభివృద్ధి



ఏటికొప్పాకలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ప్రజాప్రతినిధులు

యలమంచిలి రూరల్: పల్లె పండుగ ద్వారా నియోజకవర్గంలో గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం యలమంచిలి మండలం ఏటికొప్పాకలో పల్లె పండగ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో రూ.17 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో రూ.1.46 కోట్లతో 80 పనులు చేపట్టనున్నామన్నారు. అనంతరం పీఎస్‌ఆర్ పేట, బయ్యవరం, ములకలాపల్లి, పులపర్తి, కృష్ణాపురం, లక్కవరం, పాథురెడ్డిపాలెం, రుక్మిణీపురం గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం పెదకలవలాపల్లిలో ఎంపీడీవో జయమాధిరి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో అభివృద్ధి పనులపై చర్చించారు.

పాయకరావుపేట: మండలంలోని నామవరం గ్రామంలో డ్రైనేజీలు, రోడ్డు నిర్మాణానికి రూ.9 లక్షలు, సీతారాంపురంలో రోడ్డు, కాలువ నిర్మాణానికి రూ.10 లక్షలు, మంగవరం రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ఇసరపు పార్వతీ, ఎంపీడీవో జయప్రకాష్‌రావు, పీఆర్ఏఈ కచేరీ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అతి

కోటవురట్ల: పల్లె పండగ వారోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది. ఉపాధి హామీ పథకం ద్వారా గతంలో నిర్వహించిన గ్రామ సభలలో గుర్తించిన పనులను చేపట్టేందుకు వారం రోజుల పాటు కార్యక్రమం చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చింది. అయితే ప్రభుత్వ కార్యక్రమం కాస్తా టీడీపీ నాయకుల ప్రమేయంతో ఆ పార్టీ కార్యక్రమంలా మారిపోయింది. అధికారుల ప్రమేయం లేకుండా టీడీపీ నాయకులు అతి చేశారు. మండలంలోని కోటవురట్ల, తంగేడు, కైలాసపట్నం గ్రామాలలో పల్లె పండగ వారోత్సవాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను కాదని మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు నానా హడావుడి చేశారు. కోటవురట్లలో ఎంపీడీవో కాశీవిశ్వనాధరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచులను పక్కన పెట్టేశారు. ఈ కార్యక్రమంతో సంబంధం లేని టీడీపీ కార్యకర్తలు తామే నాయకులుగా ఫీలై హడావుడి చేశారు. దీంతో జనం ముక్కున వేలేసుకున్నారు.

సిండికేట్‌దే లాటరీ!

- మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ పూర్తి
- షాపుల కోసం కూటమి నాయకుల చెట్టాపట్టాల్
- పాయకరావుపేట సర్కిల్‌లో 18 షాపుల కేటాయింపు

నక్కపల్లి: పాయకరావుపేట సర్కిల్ పరిధిలో 18 మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు కేటాయించేందుకు సోమవారం నిర్వహించిన లాటరీ ప్రక్రియ పూర్తయింది. మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు కూటమి నాయకులు సిండికేట్ అయ్యారు. పాయకరావుపేట సర్కిల్ పరిధిలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల పరిధిలో మొత్తం 18 షాపులకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. మొత్తం 366 దరఖాస్తులు వచ్చాయి. అప్లికేషన్‌తో పాటు రూ.2 లక్షల డీడీలు సమర్పించారు.

నక్కపల్లి మండలంలో 5 షాపులకు 107 దరఖాస్తులు, ఎస్.రాయవరం మండలంలో 7 షాపులకు 126, పాయకరావుపేట మండలంలో 6 షాపులకు 133 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కొక్క దరఖాస్తు నుంచి రూ.2లక్షల చొప్పున ప్రభుత్వానికి రూ.7.32 కోట్లు ఆదాయం వచ్చింది. 366 దరఖాస్తుల్లో మొత్తం 18 మాత్రమే ఎంపిక చేశారు. మొత్తం షాపుల్లో సుమారు 8 షాపులు స్థానికులనే వరించినట్లు సమాచారం. సోమవారం అనకాపల్లిలో నిర్వహించిన లాటరీలో 18 మందిని దుకాణాలు వరించాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల వారే కాకుండా ఇతర మండలాలు, ప్రాంతాల వారు కూడా మద్యం దుకాణాలకు డీడీలు తీసి దరఖాస్తులు సమర్పించారు. మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు నాయకులంతా ఏకమయ్యారు. ఒక్కొక్క దుకాణానికి 15 నుంచి 30 మంది వరకు వాటాదారులుగా ఉన్నట్లు సమాచారం. సోమవారం నిర్వహించిన లాటరీలో పాయకరావుపేట సర్కిల్ పరిధిలో షాపులు దక్కించుకున్న వారిలో కందుల సాయినాథ్, గజ్జి లోవరాజు, అంకం సురేష్, పిన్నమరాజు రవివర్మ, చింతలశేఖర్, భరతం అనుష, వి.సత్యనారాయణ, గొంతిన అనిల్‌బాబు, పత్రపల్లి శ్రీనివాస్, షేక్ జాన్‌మియా, కల్లేపల్లి వరహాలబాబు, లాలం కార్తీక్‌కుమార్, గౌరీపట్టపు నరేష్‌కుమార్, కొయిలాడ మోతీలాల్, కొయిలాడ కమల్ చంద్రవాసు, గుర్రం నానాజీ, గొర్లి పేరిశేషుబాబు, మహ్మద్ సాదిక్ హుస్సేన్ ఉన్నారు. 15వ తేదీన లైసెన్స్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేస్తే 16వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త మద్యం పాలసీ ప్రకారం దుకాణాలు తెరుచుకోనున్నాయి. సుప్రీంకోర్టు నిబంధనలు అనుసరించి జాతీయ రహదారికి ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. కనీసం కిలోమీటరు దూరంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయాలి. గత ప్రభుత్వం ఈ నిబంధనలను పక్కాగా పాటించింది. కూటమి ప్రభుత్వంలో కొత్త మద్యం పాలసీ ప్రకారం ఏర్పాటు చేస్తున్న దుకాణాలు నిబంధనలు పాటించి ఏర్పాటు చేస్తారా? లేదా? అన్నది వేచి చూడాలి.

శాస్త్రోక్తంగా శివ మాలధారణ



మునగపాకలో శివమాలలు ధరించిన భక్తులు

మునగపాక: మునగపాకలో సోమవారం పలువురు భక్తులు శాస్త్రోక్తంగా శివమాలలు ధరించారు. 41 రోజుల దీక్షలో భాగంగా గురుస్వామి మాడెం జోగారావు ఆధ్వర్యంలో మునగపాక సాంబశివుని సన్నిధిలో మాలలు ధరించారు. ఏటా కార్తీక మాసంలో వందలాది భక్తులు శివమాలలు ధరించడం ఆనవాయితీ. కొంతమంది భక్తులు అర్ధ మండలం, మరికొంత మంది భక్తులు మండలం, ఇంకొంత మంది వీలును బట్టి మాలలు ధరిస్తుంటారు. ఈ ఏడాది కూడా మాలలు పెద్ద సంఖ్యలో ధరించేందుకు భక్తులు సమాయత్తమవుతున్నారు. సాంబశివుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాలలు ధరించారు.

అందుబాటులో ఈ-పంట జాబితా

మునగపాక: ఖరీఫ్ కాలానికి సంబంధించి ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల జాబితా సచివాలయంలో అందుబాటులో ఉంచామని వీఏఏ సింధూజ ఒక ప్రకటనలో తెలిపారు. 2024కు సంబంధించి ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాల్లో ఏమైనా సందేహాలుంటే ఈ నెల 16వ తేదీ లోగా తెలియజేయాలని ఆమె కోరారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి నిమజ్జనం



ఉమ్మలాడలో దుర్గాదేవి అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

నక్కపల్లి: శరన్నవరాత్రులు పూర్తి కావడంతో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి ప్రతిమల నిమజ్జనం కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి శరన్నవరాత్రులను నిర్వహించారు. డీజేలు, బళ్లవేషాలు, నేల డాన్సులు, పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. దేవవరం, కాగిత, గొడిచర్ల, నక్కపల్లి, ఉద్దండపురం, వేంపాడు, చినదొడ్డిగల్లు, జగన్నాధపురం, డొంకాడ, తదితర గ్రామాల్లో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవార్లను ఆదివారం రాత్రి ఘనంగా నిమజ్జనం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా పలు చోట్ల నేల వేషాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఉమ్మలాడలో పలు విగ్రహాలను స్థానికంగా ఉన్న శారదా నదిలో నిమజ్జనం చేశారు.

రాంబిల్లి ప్రధాన రహదారి పునర్నిర్మాణానికి డిమాండ్



రాంబిల్లి రహదారిలో గుంతల వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి(యలమంచిలి): గుంతలు పడిన రాంబిల్లికి వెళ్లే ప్రధాన రహదారిని పునర్నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, రాంబిల్లి మండల కన్వీనర్ జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం రాంబిల్లి మండలంలో ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి నేవీ గేట్ వరకు వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద గుంతలు పడడంతో రాకపోకలకు వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈ రహదారిలో సంతపాలెం, అప్పన్నపాలెం, రాజకోడూరు, కొండవారిపాలెం రాంబిల్లి, గోవిందపాలెం గ్రామాల వద్ద పెద్ద పెద్ద గుంతలు పడ్డాయన్నారు. నేవీ ప్రాజెక్ట్‌కు పెద్ద బండరాళ్ల లోడును తీసుకెళ్తున్న లారీల వల్ల రోడ్డు దెబ్బతిందని వారు ఆరోపించారు. ఆర్ అండ్ బీ అధికారులు జోక్యం చేసుకొని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగల దృశ్యం

ఎస్.రాయవరం: విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకోవడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. కొరుప్రోలు పెద్ద చెరువుకు ఆనుకుని కలింగల్ మదుం వద్ద విద్యుత్ స్తంభాన్ని తీగలు అల్లుకుని ఉన్నాయి. విద్యుత్ తీగలు కూడా కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. నెల రోజుల్లో పనులు పలుమార్లు విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినప్పటికీ ఈ లైన్‌లో ఎటువంటి క్లియరెన్స్ పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలు తొలగించాలని వినియోగదారులు కోరుతున్నారు.

మునగపాక ఈవోఆర్డీగా సోమరాజు

మునగపాక: మునగపాక మండల పరిషత్ ఈవోఆర్డీగా ఎం.సోమరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈవోఆర్డీగా పని చేసిన వెంకటలక్ష్మిని కశింకోట మండల పరిషత్‌కు బదిలీ చేశారు. బదిలీల్లో భాగంగా కశింకోట ఈవోఆర్డీగా పనిచేసిన సోమరాజును మునగపాకకు బదిలీ చేశారు. ఈ మేరకు సోమరాజు తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.